

Siva

# దగా

**కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి**





నా గురించి నేను

జననం: డిసెంబరు 14, 1940
ఓరెడ్డి కొత్తపల్లె, జమ్మల మడుగు తాలూకా, కడప జిల్లాలో

తల్లిదండ్రులు: కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటమ్మగార్లు

విద్య: ప్రభుత్వ కళాశాలల్లో ఆంగ్లోపన్యాసకత్వం.

సద్యోగం: వామపక్ష సాహిత్య నిబద్ధత

చదువుకు బదులుగా డిగ్రీల కార్ఖానాలు తెరిచిన ప్రభుత్వ రాజకీయవిధానానికి ప్రతిక్రియగా

—కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి

* రచయిత చిరునామా
కె.పద్మనాభరెడ్డి
3/533, హోర్వ్స్ పేట్ పి.ఓ.
ప్రొద్దుటూర్—516 361

వీర పాపాయి పల్లె వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది పాపారావుకు. శ్రీ సీతారామాంజనేయ వివేకానంద జూనియర్ కాలేజి సిబ్బందీ, పిల్లలూ, ఊళ్ళోని పెద్దలూ—యావన్మందిన్నీ పాపారావును అపురూపంగా చూసుకుంటున్నారు. ఆయన అల్లంత దూరాన చూచాయగా కనిపించగానే నమస్కారాలు కుమ్మడం, వొదిగి నించోవడం, బీడీ సిగరెట్‌లను త్యజించడం, వగైరా వింత పోకళ్లు పోతున్నారు. వాళ్ల వరస చూస్తే పాపారావు కాళ్లకు మట్టి అంటకుండా ఏకంగా ఎత్తుకు తిరగాలని ఆరాటపడుతున్న వాళ్లలా ఉన్నారు. వాళ్ళు మర్యాద చేస్తున్నారో, ఎద్దేవా చేస్తున్నారో పోల్చుకోవడానిక పాపారావుకు ఒక్కపూట వ్యవధి కావల్సి వచ్చింది. వాళ్లు చేస్తున్నది మర్యాదేనని నిర్ధారణ చేసుకున్నాక పాపారావు ఆనందంతో లుంగలు చుట్టుకుపోయాడు. క్రితం విద్యార్థిగా తను మేష్టార్లంటే ఎంత భయభక్తులు చూపేవాడో,అంతకు పదింతలు భయభక్తులు ఇప్పుడు ఊళ్లో వాళ్లంతా దాదాపుగా తన పట్ల చూపిస్తున్నారు. లెక్చరర్‌గా తన పదిహేనేళ్ల సర్వీసులోనూ తన ప్రియతమ విద్యార్థులు గూడా తన్ను అంత మురిపెంగా చూసుకోలేదు. చదువును కిలోల వారిగా, క్లాసులవారిగా, క్లాజులవారిగా అమ్మజూపుతున్న కుక్కమూతి పిందెల శకంలో, టీచరుకు ఇంతటి గౌరవాన్నిచ్చే జనం కంటబడటం—సదరు జనావళిలో విద్యార్థులు కూడా ఉండటం—పాపారావుకు ఏదో లోకంలో ఉన్నట్లుంది.

వీరపాపాయి పల్లెలో ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించడానికిగానూ తన్ను డిపార్టుమెంటల్ ఆఫీసరుగా బోర్డు వారు నియమించడం తన అదృష్టమనుకొన్నాడు పాపారావు. అందులోనూ, సదరు వార్తను సదరు జూనియర్ కాలేజి కరెస్పాండెంటుగారే మోసుకు రావడం మంచిపనే అయింది. కరెస్పాండెంటుగారు—వారిపేరు రామాంజనేయులు—బహు దొడ్డ మనిషి. నిలువెల్లా తొణికిసలాడే మనుతేత వినయం వారిది. వారి నోటి గుండా పాపారావు నాన్నగారు వారికి ఆగర్భ మిత్రులని విని తన జన్మ తరించిందనుకున్నాడు పాపారావు. ఆగర్భ మిత్రుని కొడుకును చూడకపోవడం, ఒక్కసారైనా కలుసుకోకపోవడం రౌరవాది నరకాలకు ఎట్లా దారితీస్తుందో వారు విడమరచి చెబితే అర్థమయింది పాపారావుకు. నరక శాస్త్రంలో అలాంటి క్లాజుందన్న సంగతి పాపారావు అంతకుముందు కనివిని మూర్ఖోని ఎరగడు. వరకంబాపతు లిటిగేషన్‌ను ఒదిలించుకోవడానికీ, డిపార్ట్‌మేంటల్ ఆఫీసరుగా తమ ఊరికి మిత్రుని కొడుకు వేం చేస్తున్నారన్న వార్త మిత్రుని చెవిని వేసిపోవడానికీ పనిమాలివచ్చారు రామాంజనేయులుగారు అరటిగెల సమేతంగా.

అయితే ఆ సమయానికి పాపారావు నాన్నగారు ఇంట్లో లేరు. "మా నాన్నగారు చనిపోయి మూడేళ్లయిందండీ" అన్నాడు పాపారావు. చచ్చే ముందు కనీసం ఒక్కమారైనా తనతో చెప్పా పెట్టకుండా మిత్రుడు చచ్చినందుకు రామాంజనేయులుగారు చాలా నొచ్చుకున్నారు. తమ నాన్నగారు అట్లా చేయడం అక్షరాలా తప్పేనని పాపారావు కూడా ఒప్పుకోక తప్పలేదు.

"ఏదో నాయనా, పాతకాలం వాడ్ని. నేనూ ఇహ బతికినంత కాలం బతకను. మిత్రునిగా మీ నాన్నకు నేను చాలా రుణపడి ఉన్నాను. మామూలు సమయాల్లోనంటే మీరెట్లాగూ మా ఊర్లకు రారు, ఏదో ఇంటర్మీడియెట్ బోర్డు వాళ్లు ఇట్లా వేసినపుడు తప్ప. పరీక్షలు జరిగినన్ని రోజులూ మీరు నా అతిథులు. కాదంటే నా మీద ఒట్టే. ఇట్లానన్నా మీ నాన్న రుణం కొద్దిగా తీర్చుకోనీ" అన్నారు రామాంజనేయులుగారు ప్రాధేయపడుతూ. వారి ఆప్యాయతకు పాపారావు కళ్లు చెమర్చాయి. వారిమాటకు ఎదురు చెప్పలేకపోయాడు.

రామాంజనేయులుగారు చొరవ తీసుకోకుండా ఉంటే పాపారావు డిపార్ట్‌మెంటల్ ఆఫీసరుగా పోవడానికి ఒప్పుకునే వాడో కాదో ఇప్పుడు చెప్పలేం. అతను ఇంతకు ముందెప్పుడూ అట్లాంటి 'భాడ్‌కోవ్' పనుల పట్ల ఆసక్తి చూపలేదు. బోర్డు వాళ్లు కూడా ఇదివరకెప్పుడూ అట్లాంటి పని అప్పజెప్పలేదు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసరుగా ఏంచేయాలో అతనికి స్పష్టంగా తెలియదు. అయినా రామాంజనేయులుగారిని మెప్పిం

వడం కోసం కష్టపడి డిపార్ట్‌మెంటల్ ఆఫీసరుగారి హక్కులూ విధులూ ఆమూలాగ్రం తెలుసుకున్నాడు. ప్రశ్న పత్రాల కవిలె కట్టలు తీసుకొని భద్రపరచడం మొదలుకొని, ఎట్లాంటి అవకతవకలు జరక్కుండా పరీక్షలు చివరి రోజువాకా ఎట్లా వెగ్గుకు రావాలో కష్టపడి ఆకళింపు చేసుకున్నాడు. పరీక్షల్లో ఎదురయ్యే ఇబ్బందులూ, పరీక్ష నిబంధనలకు లోబడి వాటిని అధిగమించే వెసులుబాట్లూ వివరంగా నోట్సు రాసుకున్నాడు, ఏదో కాంపిటేటివ్ పరీక్షలకు తనే హాజరౌతున్నంత శ్రద్ధగా. ఇదంతా రామాంజనేయులుగార్ని మెప్పించాలన్న తపనతోనే.

ప్రశ్న పత్రాలు స్వీకరించి, సరి చూసుకొని, పోలీసు స్టేషన్‌లో భద్రపరచడానికి వీరసాపాయి పల్లె వెళ్లినపుడు పాపారావుకు ఘనమైన స్వాగతం లభించింది. పాపారావు గౌరవార్థం రామాంజనేయులుగారు బ్రహ్మాండమైన విందు ఇచ్చారు. ఊళ్లోని వివిపి లందరినీ కూడేసి "మన డిపార్టుమెంటల్ ఆఫీసరుగారు" అని ఆత్మీయంగా పరిచయం చేశారు. విందులో ఒకరిద్దరు జిల్లా అధికారులు గూడా వున్నారు. సాంఘికంగా, అధికారికంగా ఆ వివిపిలలో చాలామంది పాపారావు కన్నా పై అంతస్థువాళ్లే అయినా, వాళ్లందరూ పాపారావే 'హిజ్ రాయల్ హైనెస్' అయినట్లు ముద్దు చేశారు. రామాంజనేయులుగారు సదరు వివిపిలలో ఎవరెవరి పిల్లలు ఇంటర్మీడియెట్ రాస్తున్నారో, వారందర్నీ గుచ్చి గుచ్చి పరిచయం చేశారు. వాళ్లలోనూ ఇంజనీరింగు చదవబోయెదెవరైందీ, మెడిసిన్ చదవబోయేది ఎవరైందీ, వాళ్లు అడ్వాన్సుగా ఏఏ ప్రొఫెషనల్ కాలేజీలలో డొనేషన్లు చెల్లించి సీట్లు రిజర్వు చేసుకున్నదీ గూడా విశదం చేశారు. "గొప్పలు చెప్పకోడం కాదుగానీ మా కాలేజీలో చదివిన పిల్లలు మంచి మార్కులు తెచ్చుకుని, పెద్ద చదువులు చదవడమే నాకు తృప్తి. ఇప్పుడు జనం వెంటపడి సేవ చేసే ఓపికా లేదు. వయసూ లేదు నాకు. ఏదో ఇట్లా ఊళ్లో కూచొని పది మందికీ ఉపయోగపడుతూ తనువు చాలిస్తే తృప్తి. మనకు కొస్త ఇబ్బంది అయినా సర్దుకొని పదిమందికీ ఉపయోగపడాలని నా పాలసీ. మొన్న కలెక్టరుగారి పి.ఏ.గారు వాళ్ళ అబ్బాయిని ఇక్కడకు బదిలీ చేయించి పరీక్షలు రాయించమని అడిగేరు. అట్లాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామయ్యగారూ, గవర్నమెంటు డాక్టరు చంద్రారెడ్డిగారూ వారి పిల్లల్ని గూడా ఈ సెంటర్‌కే మార్పించే ఏర్పాటు చేయమని ప్రాధేయపడ్డారు. పరీక్షల ముందు సెంటర్ మార్చడమంటే అల్లా టప్పా వ్యవహారం కాదు. కానీ కాదనలేకపోయాను. హైదరాబాదులో వారం రోజులు తిష్ఠవేసి, అడ్డమైన వాడినీ ప్రాధేయపడి మొత్తానికి అంతా సానుకూలం చేసుకు వచ్చేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది" అన్నారు రామాంజనేయులుగారు కాస్త గర్వంగా.

పాపారావు రామాంజనేయులుగారి మాటలు చాలా శ్రద్ధగా విన్నాడు. ఆరు పదులు నిండిన వయస్సులో కూడా కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు అతని వైపు మెచ్చుకోలుగా చూశాడు. ఆయనేం గొప్పలు చెప్పకోవడం లేదనిపించింది పాపారావుకు. పైగా తను ఆ ప్రాంతానికి కొత్త వాడు. రామాంజనేయులుగారి లాంటివారు చెబితేతప్ప ఆ ప్రాంతానికి సంబంధించినవి కానీ, కాలేజీకి సంబంధించినవి కానీ విశేషాలు తెలిసే అవకాశం లేదు.

పరీక్షల ముందు రోజు సీటింగ్ అరేంజ్‌మెంట్సునూ, గదుల్నీ చూద్దామని వెళ్లాడు పాపారావు. అప్పుడు తనకి మరో విశేషం తెలియవచ్చింది. ఊరి నడిబొడ్డున మెయిన్‌రోడ్డు ప్రక్కనున్న జూనియర్ కాలేజి భవనాలలో కాక, ఊరి బయట మట్టి రోడ్డుకు కూడా అందుబాటులోలేని హైస్కూలులో పరీక్షలు జరుగుతాయని. పాపారావుకు ఆ ఏర్పాటు నచ్చలేదు.

రామాంజనేయులుగారు ఆ ఏర్పాటు వెనకనున్న సైద్ధాంతిక ప్రాతిపదికను ఇట్లా వివరించారు. "పరీక్షలు రాయడానికి ప్రశాంత వాతావరణం కావాలి. ఇక్కడ ఊళ్లో బస్సు రొదలూ, బర్రె గొడ్ల అరుపులూ, తాగుబోతుల తగుల్లాటలూ, పిల్లలు ఎట్లా పరీక్షలు రాస్తారు చెప్పండి? అందుకే బోర్డు వారితో కొట్లాడి పరీక్షలు ఊరి బయట హైస్కూల్లో ఏర్పాటు చేయించాను."

రామాంజనేయులుగారి సిద్ధాంత బలం పాపారావు అభిప్రాయాన్ని మార్చలేకపోయింది. కాలేజీ భవనాలతో పోలిస్తే హైస్కూలు గదులు కేవలం పాకలు. పైగా హైస్కూలు దగ్గరకు ఎగుడు దిగుడు కాలిబాట తప్పమరో రహదారి లేదు. కానీ పాపారావు దాని మీద చర్చను పెంచలేదు.

"నాకట్లా చేయడం సబబనిపించడం లేదండీ" అన్నాడు ముక్తసరిగా.

"మరి...మరి...ఇప్పుడు దాన్నిఎట్లా మారుస్తామంటారు? బోర్డువారికి అదే పరీక్షా కేంద్రమని వ్రాసి పంపాం గదా?" అన్నారు రామాంజనేయులుగారు చేతులు నలుపుకుంటూ.

"సరె...కానీండి" అన్నాడు పాపారావు.


మర్రోజు పరీక్షలు టంచనుగా ఉదయం ఎనిమిదిన్నరకు మొదలైనాయి. మొదటి పరీక్ష ఇంగ్లీషు. పరీక్షా కేంద్రం చుట్టూ మామూలుగా ఉండే దడబడలూ, జన సందోహాలూ ఏమీ లేవు. ప్రశ్న పత్రాలు క్లాసు రూములకు పంపిణీ చేసిన వెంటనే పాపారావు ఒకమాటు గదులన్నీ తనిఖీచేసి వచ్చాడు. పిల్లలంతా శ్రద్ధగా తల ఒంచుకొని రాసుకుంటున్నారు. పాపారావు మనసులో ఎక్కడో అరకొరగా ఉన్న అనుమానం కాస్తా నివృత్తి అయింది. రామాంజనేయులుగారంటే మరింత గౌరవం పెరిగింది. పరీక్షా కేంద్రం ఇక్కడకాక నడి ఊళ్లో పెట్టి ఉంటే ఇంత ప్రశాంతంగా పరీక్షలు జరిగేనా?

అరగంట గడిచాక క్లాసుల్లోంచి గుసగుసల్లాంటివి పాపారావు చెవిని పడ్డాయి. మళ్ళీ ఒకమారు తనిఖీ చేద్దామని లేచాడు ప్రిన్సిపాల్ గదిలోంచి పాపారావు. అంతట్లోనే ప్రిన్సిపాల్‌గారు హడావుడిగా టిఫిన్ పొట్లాలు పట్టించుకొని వచ్చారు. "ఇప్పుడేగా ఒకరౌండు వేసి వచ్చారు? రండి టిఫిన్ చేసి వెళ్లొచ్చుగానీ" అన్నారు. పాపారావు సరేనన్నట్టుగా కుర్చీలో కూలబడ్డాడు. ప్రిన్సిపాలు పొట్లాలు విప్పి పాపారావు ముందుకొకటి జరిపి మరోటి తన ముందు వేసుకున్నాడు. టిఫిన్ తింటూ ప్రిన్సిపాల్‌గారు యథాలాపంగా మొదలుపెట్టారు. "ఇవ్వాళ ఇంగ్లీషు పేపరు చూశారా? చాలా కష్టంగా ఉందంటున్నారు. పైగా ఈ చివరి టర్మ్‌లో మా లెక్చరర్‌గారు జబ్బుపడి సిలబస్ పూర్తి చేయలేదు. మీరు కాస్త ఉదారంగా ఉంటే తప్ప మేము ఈ గండం గడిచి గట్టెక్కలేం."

పాపారావు టిఫిన్ తినడం ఒక్క క్షణం ఆపాడు. "ఉదారంగా ఉండడమంటే...?"

"ఏముంది? కాస్త చూసీ చూడనట్లు ఉండమనే. అదేమిటో మీకెరగని సాంకేతిక పదమయినట్లు అడుగుతారే..." అన్నారు ప్రిన్సిపాల్‌గారు తేలిగ్గా.

"చూశారా. మీరు దాన్ని స్పష్టంగా చెప్పడానికి కూడా నసుగుతున్నారు. పిల్లలు కాపీ చేస్తారు, మాస్టా



ఊరుకొమ్మనే కదా దాని అర్థం? ఆ పని మీరు చేయరాదు. నేను చేయను గాక చేయను. మన విధి కాపీ జరక్కుండా చూడడం, కాపీ చేస్తున్నవారి మీద చర్య తీసుకోవడం, కాపీని క్రమబద్ధం చేయడం కాదు'' అన్నాడు పాపారావు మందలింపుగా.

''చూడండి మాస్టారూ! నోటితో నీతులు వెబుతూ నొసటితో వెరిపేసేవారంటే నాకు మహా అసహ్యం. నీతులూ, బూతులూ కడుపు నిండిన వారికే చెల్లు. నాకు విధి నిర్వహణకంటే బతుకుతెరువే ముఖ్యం. మీలా కడుపు నిండినవారు డ్యూటీని కావలించుక్కూచున్నా చెల్లుతుంది. నేను మా కరెస్పాండెంటుగారు చెప్పినట్లు చేస్తేనే చెల్లుతాను. మీరు చెప్పినట్లు చేస్తే దమ్మిడీకి కొరగాను'' అన్నారు ప్రిన్సిపాల్ గారు.

''అదేమిటి, అంత అన్యాయంగా మాట్లాడుతారు? రామానుజంగారే పిల్లలతో కాపీ చేయించమని మీమీద ఒత్తిడి తెస్తున్నట్లు గింజుకొంటున్నారే?'' అన్నాడు పాపారావు తెల్లబోతూ.

''మా కరెస్పాండెంటుగారి ఆదర్శమే అది. ఆ మాటకొస్తే ఆయన సర్వస్వమూ అదే. అలాంటి పనులు ఆయన ఎవరికో చెప్పి చేయించరు. స్వయంగా తనే, క్రమబద్ధంగా, అమిత క్రమశిక్షణా సమేతంగా చేస్తారు.''

పాపారావు ఈ మాటల్ని ఈషణ్మాత్రం నమ్మలేదు. ''మీ వెధవ బుద్ధుల్ని ఆయనకెందుకు అంటగడతారు?'' అన్నాడు కటువుగా.

ప్రిన్సిపాల్ గారికి కాస్త చురుక్కుమన్నట్లుంది. ''ఎవరివి వెధవ బుద్ధులో, ఎవరివి జొల్లు సుద్దులో తెలుసుకోవాలనుకుంటే ఈ స్కూలు వెనకే ఉన్న సత్రంలోనికి కాస్త తొంగి చూడండి. పరీక్షలు నాల్రోజులున్నాయనగా పరీక్షా కేంద్రాన్ని ఈ ఊరికి మార్పిడి చేయించుకొని ముప్పైమంది ఘరానా ఆఫీసర్ల పిల్లలు ఇక్కడ పరీక్షలు వ్రాయడానికి ఎందుకు దిగబడ్డారో ఆలోచించండి. మామూలుగా మెతుకు విదపని మా ఆసామీ మిమ్మల్ని ముప్పూటలా మనుగుడుపుల అల్లుడ్ని మేపినట్లుగా ఎందుకు మేపుతున్నాడో గమనించుకోండి. అయినా ఇవన్నీ మీకు తెలీవా? ఇది మీ ఇద్దరూ కలిసి ఆడే ఉమ్మడి నాటకం కాదా? ఈ మీ పితలాటకంలో నా పాత్ర చూపుకు ఘనమే అయినా చేతకు లఘువే కాదా?'' అన్నారు ప్రిన్సిపాల్ గారు వెటకారంగా.

''డామిట్! నోరుందని తోచిందల్లా వాగకండి. అది సరైన పద్ధతి కాదు.'' అన్నాడు పాపారావు స్వరం హెచ్చిస్తూ, తన సంస్కారాన్ని కాదని తన్నుకు వస్తున్న కోపాన్ని అదుపు చేసుకుంటూ.

''ఇది వాగుడు కాదు. నిగడదన్నిన నిజం. ఏడేళ్ల కిందట ఈ కాలేజీ పుట్టినప్పటి నుండీ నా పేరు మీదనే ఇక్కడ పరీక్షలు జరుగుతున్నాయి. నా కోరిక మేరకుగానీ, ప్రభుత్వ నియమాల మేరకు గానీ ఎప్పుడూ ఏదీ జరగలేదు. ఏయేటికాయేడుగా ఇదే తంతే. కాకపోతే ఇంకొంత నాగరీకంగా, నాజూగ్గా, సున్నితంగా ఏయేటికాయేడు ఇబ్బడిగా ముబ్బడిగా ముడుపులు మీకు, తిట్లు మాకు. విందులు మీకు, మెమోలు మాకు.''

''దయచేసి మీ లేకి కూతలు ఆపండి. మీరు మాటలతో డ్యూటీ చేస్తున్నారు. నేను చేతల్లో ఆ డ్యూటీ ఎట్లా ఉంటుందో చూపిస్తా'' అన్నాడు కఠినంగా పాపారావు.

అనటమే కాదు. సగం తిన్న టిఫిన్‌ను పక్కకు తోసి దూకుడుగా క్లాసుల్లోకి దూరాడు. కొందరు పుస్తకాలు చూసి, కొందరు కాగితాలు చూసి, మరి కొందరు బోర్డుమీద రాసినదాన్ని చూసి కాపీ రాసుకుంటున్నారు. నలుగురు ఒక కాగితం చుట్టూ ఒరగబడి దీక్షగా చూసిరాత రాస్తున్నారు.

పాపారావు రాకను ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు. కొందరు చనువుగా, మరికొందరు వెర్రిగా చిరునవ్వు నవ్వేరు అతని రాకను గుర్తించినట్టుగా. మెజారిటీకి ఆ మాత్రం పురసత్తు కూడా లేక ఆ ఆర్భాటం గూడ చేయలేదు.

చాలా గదుల్లో ఇన్విజిలేటర్లు లేరు. వాళ్లంతా స్కూలు వెనక సత్రంలో కరస్పాండెంటుగారి చుట్టూ విడిది చేసి గైడ్లలోంచి సమాధానాలు వూడబీకుతున్నారు. కొండొకచో కార్బన్ కాపీలు మలుస్తున్నారు. కరస్పాండెంటుగారు ఆ కాపీ కాగితాలు ఎవరెవరికి బట్వాడా చేయాలో పురమాయిస్తున్నారు.

పాపారావు భగ్గుమన్నాడు. చరచరా సత్రం దగ్గరికి నడిచి కళ్లతో నిప్పులు కురిసేడు. ''అయ్యా, రామానుజంగారూ, ఇదంతా తమ నిర్వాకమేనా? అయితే మీ గురించి నేను చాలా పొరబడ్డాను. తమరు తక్షణం ఇక్కడి నుండి దయచేయండి. పరీక్షలు ముగిసేదాకా మళ్లీ ఈ ఛాయలకు రాకండి.''

అక్కడున్న ఇన్విజిలేటర్లు కకావికలై కన్నుమూసి తెరిచేలోగా క్లాసు రూముల్ని కావిలించుకున్నారు. కానీ రామానుజంగారు కదలనూ లేదు, మెదలనూ లేదు. కకావికలసలే కాలేదు. చిరునవ్వుతో చేతులు నలుపుకుంటూ పాపారావు దగ్గరికొచ్చేదు.


''మీరు అలా కోప్పడకూడదు. ఇందులో మనం కానిపని ఏమీ చేయడం లేదు. మీరూ, నేనూ అందరమూ పిల్లల మేలుకోరే వాళ్లమే. ఇది ఇలా జరగనివ్వండి'' అన్నాడు.

''నేను ఇక్కడికి పిల్లలకు మీరు అనుకున్న మేలు చేయడానికి రాలేదు. డిపార్టుమెంటల్ ఆఫీసరుగా డ్యూటీ చేయడానికి వచ్చాను'' అన్నాడు కరిచినట్టుగా పాపారావు.

''ఎందుకంత తొక్కులాడతారు? ఇక్కడ మీ డ్యూటీ కొచ్చిన ప్రమాదేమేమీ లేదు. ఎవరికీ ప్రమాదం జరక్కూడదనే వాళ్లలో నేను ప్రథముడ్ని. ఫ్లయింగ్ స్క్వాడు వాళ్లుగానీ, డి.ఇ.ఓ.గాని ఇతర ఏ అధికారులు గానీ ఇక్కడికి మనల్ని ఏమార్చి రాలేరు. ఆకస్మిక తనిఖీ చేయలేరు. ఇక్కడికి వాహనాలు రావు. కాలి నడకే గతి. ఊళ్లోంచి వాళ్లు నడిచి రావడానికే అరగంట టైము తీసుకుంటుంది. ఊళ్లో ఎవళ్లు అడుగు మోపినా, ఆ మరుక్షణమే ఆ వార్త మనకు చేరుతుంది. తరువాతి క్షణానికల్లా ఇక్కడి వాతావరణాన్ని మీ విధి నిర్వహణకు మెరుగులు దిద్దేలా తీర్చి దిద్దుతాము. నన్ను నమ్మండి. నమ్మిన వాళ్లను నేను ఎప్పుడూ మోసం చేయనుగాక చేయను'' అన్నారు రామాంజనేయులుగారు అభయప్రధానం చేస్తూ.

''నాకు మోసం జరక్కుండా నేను చూసుకోగలను. మీ పిల్లలు మొత్తం డీబార్ కాకుండా మీరు చూసుకోండి. కాపీ తక్షణం మానిపించండి. అయిదు నిముషాల వ్యవధి ఇస్తున్నాను. ఆ తర్వాత కాగితం ముక్క, అది తెల్లకాగితం అయినా సరే, ఏ పిల్లవాడి దగ్గరా ఉండడానికి వీల్లేదు. ఉందా, వారిమీద వెంటనే చర్య తీసుకుంటాను'' అన్నాడు పాపారావు ఖండితంగా.

రామానుజంగారి మొహం అదోలా ముడుచుకుపోయింది. ''మాస్టారూ! మీరు ఇప్పుడు నన్ను ఇరుకున పెట్టడం బాగోలేదు. చాలామంది పెద్దవాళ్ల పిల్లలు ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. వాళ్ల భవిష్యత్తుకు నేను




# గోపాళం భేళాళం

శభాష్ బిడ్డా!


'నాలుగు కాళ్ళున్నా నడవలేనిదేది?

పిస్తోలు దెబ్బతిన్న పులి



''నీ తలకాయ—ఆలోచించు

కుర్చీ



కరక్టు! మరో ప్రశ్న—ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడిన రైతు ఏమవుతాడు?

అలసిపోతాడు

శభాష్ బిడ్డా!

—మెజీషియన్ బి.వి.పట్టాభిరావ్

హామీ ఇచ్చాను. నేను మాట అంటే పడి వచ్చే మనిషిని. నాకోసం ఈ ఒక్కమారూ సర్దుబాటు చేసుకోండి. మీ రుణం ఉంచుకోను. ఇప్పటికిది ఉంచండి.'' జుబ్బా జేబులోంచి స్టేట్‌బాంక్ సీలుతో ఉన్న రెండువంద రూపాయల కట్టలు తీసి పాపారావు చేతుల్లో ఉంచాడు. ''ఇది మీకు ఇక్కడ ఇవ్వడం కంటే ఇంటికి పంపడం మేలనుకొని ఇంతవరకూ ఆగాను. కానీ మీరు తొందరపడుతున్నారు.''

పాపారావు చేతిలో ఉన్న నోట్ల కట్టలవంక అయోమయంగా చూశాడు.

రామానుజంగారి మొహం కాస్త కళ పుంజుకుంది. ''చూడండి మాస్టారూ! పరీక్షలు ముగిసేలోగా మిమ్మల్ని అన్ని విధాల సంతృప్తి పరచి పంపిస్తాను. నా మాట నమ్మండి'' బుద్ధిగా ఉంటే మరికొన్ని ప్రోత్సాహక బహుమతులున్నాయి సుమా అని ప్రలోభ పెడుతూ అన్నారు.

''రామానుజంగారూ!'' అన్నాడు పాపారావు. ''నేను కాలేజీరోజుల్లో మంచి ఫుట్‌బాల్ ఆటగాడ్ని.''

''అదెంత భాగ్యంలెండి! సాయంకాలానికల్లా కోర్టు సిద్ధం చేయిస్తాను, మీరున్నన్ని రోజులూ బొందు పోకుండా ఆడుకుందురుగానీ.''

''మీ ఏర్పాటు గురించి కాదు నా సందిగ్ధం. ఇప్పుడు అంత బాగా ఆడగలనో లేదో అని. ప్రయత్నిస్తా, మీరు చూసి చెప్పండి'' అన్నాడు పాపారావు. మరుక్షణానికల్లా నోట్ల కట్టలు రెండూ ఫ్లయింగ్ సాసర్లలాగా ఒకదాని వెంట ఒకటి జుయ్యుమని ఎగురుకుంటూ పోయి కాలి బాట పక్కన దుమ్ములో మహా స్పీడుగా గెన్నెరగోలు తిరిగేయి.

''బాగానే ఆడగలనంటారా?'' అనడిగాడు పాపారావు చేతులు నలుపుకుంటూ రామానుజంగారి వేపు తిరిగి.

రామానుజంగారికి నోటమాట రాలేదు. క్షణంలో సగం సేపు దిమ్మెరపోయేడు. కోలుకొని కంటివెంట ఏకధారగా నీరు కురిశాడు. జీవితం యావత్తూ అకస్మాత్తుగా మట్టిపాలైనట్లు భోరుమన్నాడు. ''అయ్యో! అయ్యో! ఇదేం పనండీ! మీకు కోపం ఉంటే నన్ను తిట్టండి. తన్నండడి. అవ్వ! డబ్బుని,డబ్బుని, అట్లా... అట్లా... అపచారం... అపచారం... చేస్తారా. తల్లీ! మహాలక్ష్మీ! ఈ తప్పు కాయవమ్మా! నన్ను మన్నించమ్మా!'' పిచ్చిపట్టినవాడిలా నోట్ల కట్టలు పడిన చోటికి దొర్లుకుంటూ పోయాడు. ఎక్కిళ్లు పట్టి ఏడుస్తూ నోట్ల కట్టల చుట్టూ ప్రదక్షిణాలు చేశాడు. వాటి ముందు దుమ్ములో సాష్టాంగపడి లెంపలు వేసుకున్నాడు. వాటి కంటిన దుమ్మును ఆప్యాయంగా పైపంచెతో తుడిచి, వాటిని కళ్లకద్దుకొని మరో మాటు లెంపలు వేసుకొని జేబులో దోపుకున్నాడు. వెనక్కి తిరగి పాపారావు వేపు చూడకుండానే కాలిబాట వెంట ఊరి వైపుకు దారితీశాడు.

పాపారావు పీడ ఒదిలిందనుకున్నాడు. గబగబా స్క్వాలు వరండావేపు వచ్చి ''అయిదు నిముషాలు సమయం ఇస్తున్నాను. కాపీ సామాగ్రినంతా తీసి పారెయ్యండి. ఆ తర్వాత నేను తనిఖీ చేస్తాను. ఎవ్వరు దొరికినా డీబార్ చేస్తాను.'' అని కేకలు వేశాను క్లాసు రూముల్లోకి తొంగి చూడకుండా.

అయిదు నిముషాల తర్వాత నిజంగానే క్లాసు రూముల్లోకి తనిఖీకి వెళ్ళాడు. అప్పటికి కాపీల ఉధృతం తగ్గింది కానీ అంతరించలేదు. అక్కడక్కడ కొందరు ఆశావాదులు కాపీ చేస్తూనే ఉన్నారు. ముప్పైమంది పాపారావుకు దొరికిపోయారు. వారి హాల్ టికెట్లూ, ప్రశ్న పత్రాలూ, సమాధాన పత్రాలూ స్వాధీనం చేసుకొని వాళ్లందరినీ ప్రిన్సిపాలు గదిలోకి లాక్కొచ్చాడు.

అప్పటికి గంట పదయింది. కాఫీ కోసం పాపారావు ప్రాణం పీకుతోంది. ఇంత రాద్ధాంతం తర్వాత కాఫీ కోసం ఎవర్ని దేవిరించగలడు? వీరపాపాయి పల్లె ఇప్పుడు పాపారావుకు గబ్బిలాల దిబ్బలాగా ఉంది. నీరసంగా ప్రిన్సిపాల్ ఎదుట కుర్చీలో కూర్చున్నాడు.

''వీరందరూ కాపీ చేస్తూ దొరికిపోయినట్లు ఇంటర్మీడియెట్ బోర్డుకు రిపోర్టు పంపమంటారు కదూ?'' అన్నారు ప్రిన్సిపాల్‌గారు.

''అది మీ విధి'' అన్నాడు పాపారావు.

''మొదటి రోజే ముప్పైమంది మీద రిపోర్టు చేస్తే మా కాలేజీ పరువేం కాను?''

''మీరూ, మీ కాలేజీ పరువును గురించి పెద్దగా పట్టించుకునే వారని నేను అనుకోను'' అన్నాడు పాపారావు హేళనగా.

''మీరు దగ్గర నుండి చూస్తున్నారు కనుక అట్లా అనిపించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఫలితాలు సాధించిన ఎనిమిది కాలేజీల్లోనూ మాదీ ఒకటి.''

''మీ కాలేజి గొప్పను ఇహ నేను విని భరించలేను. వీళ్లందరి దగ్గరా స్టేట్‌మెంట్స్ తీసుకొని రిపోర్టు చేయండి.''

''రిపోర్టా? నేను చేయనుగాక చేయను.''

''చెయ్యాలి. చేసి తీరాలి.'' అన్నాడు పాపారావు పట్టుదలగా.

''నేను చేయను. మిమ్మల్ని చేయనివ్వను.'' అన్నారు ప్రిన్సిపాల్‌గారు అంతే పట్టుదలగా.

పాపారావుకు ఏమీ పాలుపోలేదు. తన నిబంధనల చిట్టాలో ఈ లిటిగేషన్ ఎక్కలేదు. కంచే చేనుమేసినప్పుడు, కంచె మీద చర్య తీసుకోవాలో, చేను మీద చర్య తీసుకోవాలో—దేనిమీదైనా చర్య ఎట్లా తీసుకోవాలో—ఏ ధర్మశాస్త్రంలోనూ తన దృష్టికి తగల్లేదు.

ఈ చిక్కు విప్పడానికేనన్నట్టు అప్పుడే డి.ఇ.ఓ. తన పరివారంతో వేంచేశాడు. పాపారావు నిశ్చింతగా ఊపిరి పీల్చుకొన్నాడు. సమస్యను ఆయనకు సమర్పించి చేతులు దులుపుకోవచ్చని.

డి.ఇ.ఓ. దిక్కులు చూస్తూ ప్రిన్సిపాల్‌గారి గదిలోకి వచ్చాడు. ప్రిన్సిపాల్‌గారు మహా వినయంగ లేచి వారికి నమస్కరించి కుర్చీని కర్చీఫ్‌తో తుడిచి ఆయన్ని కూర్చుండబెట్టారు. పాపారావుకు వారు పరిచయం

లేదు. ప్రిన్సిపాల్‌గారు పాపారావును డి.ఇ.ఓ.గారికి పరిచయం చేసే ప్రయత్నం కూడా చేయలేదు. డి.ఇ.ఓ. పాపారావును ఎగాదిగా చూశారు కానీ ఆయన ముందున్న ఇంటర్మీడియేట్ సమాధాన పత్రాల బొత్తిని కానీ, ప్రిన్సిపాల్‌గారికి కాస్త ఎడంగా వివిధ భంగిమల్లో విన్యసిస్తున్న పిల్లల్నిగానీ చూడలేదు. నిటారుగా ప్రిన్సిపాల్‌గారికేసి చూసి "డిపార్ట్‌మెంటల్ ఆఫీసరుగారెక్కడ?" అనడిగారు.

ప్రిన్సిపాల్‌గారు నోరు విప్పకముందే పాపారావు తన్ను తాను పరిచయం చేసుకున్నాడు. "నేనేనండీ! అయామ్ పాపారావు."

"గ్లాడ్ టు మీట్‌యూ. మీతో రెండు నిముషాలు మాట్లాడాలి: బయటకు వెళ్దామా?" అన్నారు డి.ఇ.ఓ.గారు లేచి బయటకు దారి తీస్తూ.

ఇద్దరూ స్కూలు వరండా దిగి సత్రం వేపు నడిచారు.

"మీరూ, కరస్పాండెంటుగారూ ఏమైనా తగాదా పడ్డారా?" అనడిగారు డి.ఇ.ఓ. సత్రం గోడకు వీపు ఆనిస్తూ.

"పడ్డాం, ఆయన కాపీ చేయించాలనీ, నేను కుదరదనీ."

"నో, నో, ఆయన అలా చెప్పలేదు. మీరు ఆయనను అయిదువేలు లంచం అడిగారనీ, ఇవ్వకపోతే కాలేజీలో పరీక్షలు సక్రమంగా జరగనివ్వనన్నారనీ వ్రాతమూలకంగా ఫిర్యాదు చేశారు. కలెక్టరుగారు ప్రత్యేకంగా విచారణ నిమిత్తం నన్ను హడావుడిగా ఇక్కడికి తరిమారు."

పాపారావు మొహం ఎర్రబడింది. "మీకు డి.ఇ.ఓ.గా ఎన్నేళ్ల అనుభవం ఉంది?" అనడిగాడు.

డి.ఇ.ఓ.గారు గుటకలు మింగారు.

"పరీక్షలు జరక్కుండా నేను ఎట్లా అడ్డుపడతానో వారు వ్రాతమూలక ఫిర్యాదులో లిఖించారా?"

డి.ఇ.ఓ.గారు గాబరాపడ్డారు. "అబ్బే, నేను ఆ ఫిర్యాదును నమ్ముతున్నానని కాదు. అయినా ఫిర్యాదు వచ్చిందంటే పరీక్షల నియంత్రణాధికారిగా నేను విచారణ చేయాలి కదా!"

"లక్షణంగా చేయండి. రామానుజంగారిని రమ్మనండి. ప్రిన్సిపాలుగారిని రమ్మనండి. విచారణ జరపండి."

"మనం ప్రభుత్వోద్యోగులం. విచారణంటూ జరిగితే అపకారం మనకే గానీ ఫిర్యాదు చేసిన అనధికారులకు జరగదు. మీకంటే పెద్దవాడిగా, అనుభవం ఉన్నవాడిగా, నేను మీకో సలహా ఇస్తాను. వింటారా."

"వింటే వింటాను, చెప్పండి" అన్నాడు పాపారావు పెంకెగా.

"మీకూ రామానుజంగారికీ అభిప్రాయభేదాలున్నాయి. మీరు ఇక్కడ ఉండడం క్షేమం కాదు. అంచేత మిమ్మల్ని అంబవరం జూనియర్ కాలేజీ డిపార్ట్‌మెంటల్ ఆఫీసరుగానూ, అక్కడున్న సోమిరెడ్డిని ఈ కాలేజీ డిపార్ట్‌మెంటల్ ఆఫీసరుగానూ మార్చివట్లు ఆర్డరు వేస్తాను. ఆర్డరు ఈ రోజు నుండే అమల్లోకి వచ్చేలా రాస్తాను. దయచేసి మీరు అక్కడికి వెళ్లండి. నేను నా జీపులో మిమ్మల్ని అక్కడ వదిలేసి వస్తాను, మీకేమీ శ్రమలేకుండా."

"చూడండి, మీరు నాకు నేను ఒద్దన్నా ఉపకారం చేయదలుచుకొన్నారు. ఆ చేసేదేదో నాకు తృప్తికరంగా చేయండి. నన్ను డిపార్ట్‌మెంటల్ ఆఫీసరు బాధ్యత నుండే పూర్తిగా తప్పించి ఇంటికి వెళ్ళనివ్వండి.

"అబ్బో,అది చాలా కష్టమైన ఉపకారమే" అన్నట్లు డి.ఇ.ఓ.గారు మొహం సీరియస్‌గా పెట్టి రెన్నిముషాలు ఆలోచన నటించాడు.

"ఆల్‌రైట్. అట్లాగే." అన్నాడు.

ఫ్యూన్‌ను పిలిచి రెండు కుర్చీలు తెప్పించి సత్రంలో వేయించాడు. ప్రిన్సిపాల్‌ను పిలిచి పాపారావుకు అప్పటిదాకా రావలసిన టి.ఏ., డి.ఏ.,లు, రిలీఫ్ ఆర్డరూ సిద్ధం చేయమన్నాడు. పది నిముషాల్లో పాపారావుకు వీరపాపాయి పల్లెకు రుణానుబంధం తెగింది.

"రండి. నేను మీ ఊరే వెడుతున్నాను. లిఫ్ట్ ఇస్తాను" అన్నాడు డి.ఇ.ఓ.

ప్రిన్సిపాల్‌గారి దగ్గర సెలవు తీసుకోవడానికి పాపారావు ప్రిన్సిపాల్ గదిదాకా వెళ్లి వస్తానని డి.ఇ.ఓ.ను విడిచి వెళ్లాడు.

"మీ సహకారానికి కృతజ్ఞున్ని.ఇహ మీరు నిశ్చింతగా పరీక్షలు జరుపుకోగల రనుకుంటాను" అన్నాడు పాపారావు ప్రిన్సిపాల్‌గారితో చేతులు కలుపుతూ.

ప్రిన్సిపాల్‌గారు చిన్నబుచ్చుకున్నారు. "అయామ్ సారీ, నేను మిమ్మల్ని బాధపెట్టాను కదూ. చెప్పాను కదా నాకు డ్యూటీ కన్నా బతుకుతెరువే మిన్న అని. అయినా మీకు ఒక్క రహస్యం చెబుతాను. మీ మీద రిపోర్టూ లేదు, పాడూ లేదు. మీకు రామానుజంగారు ఇవ్వజూపిన డబ్బులో సగం కతికి డి.ఇ.ఓ.గారు ఈ నాటకం ఆడారు."

"నేను అది తెలుసుకోలేక కాదు. ఇక్కడుండి నేను చేయగలిగింది ఏమీ లేదు. కనుక వెళ్లిపోతున్నా" అన్నాడు పాపారావు.

"మా కరెస్పాండెంటుగారు సాధారణంగా ఇల్లాంటి విషయాల్లో సకల జాగ్రత్తలూ తీసుకునే వాడే. ఒక్క మీ విషయంలోనే ఎక్కడో పొరపాటు జరిగింది. బహుశా వోలి తగ్గుతుందని దురాశపడ్డాడేమో."

"నా దిగులల్లా మీరు చదువును బిజినెస్‌గానైనా చూడ్డంలేదనే—మీరుగానీ, మీ కరస్పాండెంటుగారుగానీ, పిల్లల తలిదండ్రులుగానీ, బిజినెస్‌లో అమ్మే సరుకుకూ, ఇచ్చే విలువకూ ఏదో ఒక విధమైన పొంతన ఉంటుంది. కానీ మీరు ఏమీ ఇవ్వకుండానే డబ్బు వాడుకుంటున్నారు. మీరు చేస్తున్నది కనీసం వ్యాపారం కూడా కాదు. దాన్ని తెలుగులో 'దగా' అంటారు. ఇంగ్లీషులో 'ఫ్రాడ్' అంటారు. నేను అందులో భాగస్వామిని కాలేను. వస్తాను. గుడ్ బై."

(ఈ కథ యావత్తూ కల్పితం. ఇందులో అక్కడింత, ఇక్కడింత వాస్తవం చోటు చేసుకున్నట్లు ఎవరికైనా తోస్తే అది కేవలం నా కల్పనా పటిమ లోపించడం వల్లనే జరిగివుండొచ్చు. క్షంతవ్యుణ్ణి.)

